# కేరక్టర్

సి. సత్యశేఖర

‘మోనాలిసా గార్మెంట్స్’ అధినేత చక్రధరరావు తన స్టెనో కమ్ పర్సనల్ సెక్రటరీ వర్షను పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు.

అంటే, రావు యువకుడనీ, పెళ్ళి కాలేదనీ అనుకుంటే పొరబడ్డట్టే. యాభై ఏళ్ళ చక్రధరరావుకు పెళ్ళయింది కానీ విడాకులు తీసుకున్నాడు పదేళ్ళ క్రితం. అతని ఎఫైర్స్ మరీ శృతిమించడంతో అతని భార్య ఎన్నో సంవత్సరాలు పోరాడి పోట్లాడి ఇక పోట్లాడే ఓపికలేక విడాకులు కోరింది. తన ఎఫైర్స్‌కు భార్య పెద్ద తలనొప్పిగా రావుకు తోచడంతో విడాకులకు ఒప్పుకున్నాడు.

మరి ఇన్ని సంవత్సరాలకు పెళ్ళి మాట తలయెత్తడానికి పాతికేళ్ళ వర్ష అందం, తెలివి తేటలు మాత్రమే కారణం కాదు వయస్సు మీదపడే కొద్ది సెక్యూరిటీ కావాలనిపించింది. అంతేకాదు తన తరువాత వంద కోట్ల విలువ చేసే ఆస్తులకు వారసులు కావాలి. మొదటి భార్యకు ఇద్దరూ ఆడపిల్లలు వారు తమ తల్లితోనే వుంటున్నారు. ఆమె క్కూడా కోట్ల ఆస్తి వుంది. కాబట్టి వారి గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు.

చక్రధరరావు ప్రపోజ్ చేయగానే ఆలోచించి చెబుతానంది వర్ష. మిడిల్ క్లాస్ కుటుంబానికి చెందిన వర్ష మీద ఆధారపడిన తల్లీ, పెళ్ళి కావాల్సిన చెల్లెలు, చదువుకుంటున్న తమ్ముడూ వున్నారు. చెల్లెలికి పెళ్ళి చెయ్యాలి, తమ్ముణ్ణి ఇంజనీరింగ్ చదివించాలి. తనకు పాతికేళ్ళు దాటిపోయాయి. చక్రధరరావు గురించి అనేక పుకార్లు విన్న వర్ష కొంచెం తటపటాయించింది. కానీ రావును పెళ్ళి చేసుకుంటే వచ్చే ఎయిర్ కండిషన్డ్ బంగళాలు, కార్లు, ఫారిన్ ట్రిప్పులూ, హోదా అన్నీ కళ్ళ ముందు 3డిలో కనబడ్డాయి.

వర్ష తన అంగీకారం తెలియజేయగానే రావు చాలా గర్వంగా ఫీల్ అయ్యాడు. తను గొప్ప ఛార్మింగ్ పర్సనాలిటీ అని రావు ఇప్పటికీ నమ్ముతుంటాడు. అతనికి ఒకే ఒక్క బలహీనత. అదే స్త్రీ! ఇప్పటివరకు ఎన్ని ఎఫైర్స్ నడిపాడో అతనికే గుర్తు వుండదు. దాన్ని గొప్ప విషయంగా, గర్వంగా చెప్పుకుంటాడు. శీలంపట్ల పెద్ద నమ్మకం లేని రావు తనక్కాబోయే భార్య గురించి మాత్రం మరో కోణంలో నుంచి ఆలోచించాడు. తనకు భార్యగా మాత్రమే కాక ఇంత పెద్ద బిజినెస్‌కు యజమానురాలు కావాలంటే కొన్ని అర్హతలుండి తీరాలి.

ఈ ఆలోచన వచ్చిన వెంటనే రావు ‘బ్లాక్ ఫాక్స్ డిటెక్టివ్ ఏజెన్సీ’ని కాంటాక్టు చేశాడు. పెళ్ళి కాబోయే వధూవరుల గత చరిత్రను ఇన్‌వెస్టిగేట్ చేయడంలో ఫాక్స్ డిటెక్టివ్ ఏజెన్సీ దేశంలోనే ‘నెంబర్ వన్ ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీ. వారు ఖచ్చితంగా నెల రోజులలో తమ రిపోర్టు అందజేస్తారు.

రెండు నెలల తర్వాత తమ పెళ్ళి జరుగుతుందని వర్షకు చెప్పాడు చక్రధరరావు. ఆమెకు ఏదో స్వప్న లోకంలో విహరిస్తున్నట్టుంది. రావు తనక్కాబోయే భార్యతో కలసి విందులకు, వినోదాలకు, షికార్లకూ తిరగడం మొదలుపెట్టాడు. అతని గురించి తెలిసిన వారెవరూ ఈ కొత్త ఎఫైర్ గురించి ఆశ్చర్యపడలేదు.

నెల తర్వాత ఫాక్స్ డిటెక్టివ్ ఏజెన్సీ నుంచి రిపోర్టు వచ్చింది. చక్రధరరావు ఆతృతగా రిపోర్టు చదవడం మొదలుపెట్టాడు.

“క్లయింట్ వర్ష చాలా ఇంటెలిజెంట్ మరియు రిజర్వ్‌డ్ టైపు అమ్మాయి. ఎటువంటి బాయ్ ఫ్రెండ్స్ లేరు. లవ్ ఎఫయిర్స్ లేవు. కాలేజి చదువుతున్నప్పుడు కూడా ఎటువంటి అనుమానాస్పద తిరుగుళ్లు లేవు. ఫామిలీ బేండ్ లేడి. కుటుంబ సభ్యుల గురించి ఎక్కువ ఆలోచిస్తుంది. కేరక్టర్ టోటల్లీ గుడ్.

చదువుతున్న చక్రధరరావు రిలీఫ్‌గా ఫీల్ అయ్యాడు. కళ్ళ జోడు సవరించుకుని చదవడం కంటిన్యూ చేశాడు.

“కానీ ఇటీవల నెల రోజుల నుంచి ఆమె ప్రవర్తన అనుమానాస్పదంగా వుంది. ఒక డబ్బున్న యాభై ఏళ్ళ ముసలాయనతో పార్టీలకూ, షికార్లకూ తిరుగుతోంది. ఆ ముసలాడి కేరక్టర్ మాత్రం మంచిది కాదు. అతను వుమనైజర్. స్త్రీలోలుడు. ఆ తిరుగుళ్ళ వల్లనే అతని భార్య విడాకులు ఇచ్చింది. తన క్రింద పనిచేసే ఉద్యోగినులకు డబ్బు, గిఫ్టులు ఆశ చూపించి ఎఫైర్స్ నడుపుతుంటాడు. డెబనాయిర్ బిజినెస్‌మాన్! అతను ఇప్పటికీ తన క్రింది ఇద్దరు ఉద్యోగినులతో ఎఫైర్స్ నడుపుతున్నాడని వినికిడి. ఈ నెల రోజుల ప్రవర్తన తప్ప మిస్ వర్ష కేరక్టర్ పాజిటివ్”

కళ్ళు బైర్లు కమ్మాయి. తన జీవితములో కేరక్టర్ గురించి మొదటిసారిగా ఆలోచించిన చక్రధరరావుకి.

